
సాక్షి విశాఖపట్నం

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



అధికార పార్టీ నేతలకే అంతరాలయ దర్శనం!

సామాన్య భక్తులకు అల్లంతదూరం



టికెట్లు, కారు పాసుల కోసం భక్తుల అగచాట్లు

- రూ.1,000 టికెట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితీ అంతే..
- రూ.1,500 టికెట్లన్నీ కూటమి పార్టీల నేతలకే..
- టికెట్ల జారీలో దేవాలయ ఈవోకి దక్కని స్థానం
- కలెక్టరేట్, అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకే వ్యవహారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

సాధారణ భక్తులకే అప్పన్న చందనోత్సవంలో పెద్ద పీట వేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన జిల్లా యంత్రాంగం.. కేవలం వీఐపీ భక్తుల సేవలోనే తరిస్తోంది. అధికార పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు వారి అనుచరులకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పించేందుకు సిద్ధమైంది. సాధారణ భక్తులు, ఆన్‌లైన్‌లో రూ.1,000 టికెట్లను కొనుగోలు చేసిన వారికి మాత్రం అంతరాలయ దర్శనం లభించడం లేదు. కేవలం సిఫార్సులకే పెద్ద పీట వేయడం, సాధారణ భక్తులకు అంతరాలయ దర్శనం లేకపోవడం వంటి వ్యవహారాలన్నీ.. దేవాలయ ఇన్‌చార్జి ఈవోని డమ్మీని చేసి కలెక్టరేట్ నుంచి నడిచాయని విమర్శలు వినిపిస్తున్నాయి. టికెట్ల జారీలో కానీ, ఏర్పాట్లలో కానీ ఈవోతో సంబంధం లేకుండా వ్యవహారాలు సాగాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. మొత్తంగా ఎన్నడూ లేని విధంగా వీఐపీ భక్తులకే అంతరాలయం ద్వారా నిజరూప అప్పన్న దర్శనం లభించనుండగా.. సాధారణ భక్తులు మాత్రం దూరం నుంచే హడావుడిగా దర్శనం చేసుకుని ముందుకు సాగాల్సిన పరిస్థితులు ఉన్నాయనే అభిప్రాయం భక్తుల్లో వ్యక్తమవుతోంది.

సిఫార్సులకే పెద్ద పీట

ఏడాదిలో ఒక్కరోజే లభించే అప్పన్న నిజరూప దర్శనం కోసం ఉత్తరాంధ్రతో పాటు ఉభయ గోదావరి, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. ఈసారి 2 లక్షల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా వేశారు. అయితే టికెట్లు మాత్రం సాధారణ భక్తులకు అందుబాటులో లేకుండా పోయాయనే విమర్శలున్నాయి. ఆన్‌లైన్ టికెట్లను కూడా ముందుగానే అధికార పార్టీ నేతలకు అప్పగించారనే ఆరోపణలున్నాయి. ఇక వీఐపీ టికెట్లతో పాటు రూ.2,500, రూ.1,500, రూ.1000 టికెట్ల జారీలోనూ కేవలం అధికార పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలకే పెద్ద పీట వేశారనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీ నేతలు కోరినన్ని టికెట్లు జారీ చేసిన జిల్లా యంత్రాంగం.. దేవాలయంలో నిరంతరంగా సేవలందించే వ్యక్తులు, సంస్థలు పది టికెట్లు అడిగితే కేవలం ఒకటి మాత్రమే ఇచ్చేందుకు అంగీకరించారు. తీరా ఈ టికెట్లను తీసుకునేందుకు సదరు బ్యాంకు వద్దకు వెళితే.. తమకు ఇంకా దేవస్థానం నుంచి లేఖ రాలేదనే సమాధానం వస్తోంది. ఈ నేపథ్యంలో దేవస్థాన అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించిన వ్యక్తులు, సంస్థలకు కూడా కనీస గౌరవ లేకుండా చేశారని వాపోతున్నారు. మొత్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారుల వ్యవహారం ఉందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

డమ్మీగా మారిన ఈవో..!



ఈవో కార్యాలయం వద్ద పడిగాపులు

ప్రస్తుత సింహాచలం దేవస్థానం ఈవో సెలవులో ఉండడంతో ఇన్‌చార్జిగా ఈవోగా కె.సుబ్బారావును ప్రభుత్వం నియమించింది. అయితే, సదరు దేవాలయ ఈవోను చందనోత్సవ వ్యవహారాల్లో నామమాత్రం చేశారనే విమర్శలున్నాయి. పాసుల జారీలో కానీ.. నిర్ణయాల్లో కానీ దేవాలయ ఈవోను డమ్మీ చేశారనే ఆరోపణలున్నాయి. పెత్తనమంతా రెవెన్యూ యంత్రాంగానిదే ఉంటోందని దేవదాయ అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. దేవాలయంలో నిరంతరంగా సేవలందించే వ్యక్తులు, సంస్థలతో పాటు ఎన్జీవోలకు కూడా టికెట్లను మంజూరు చేయాలంటే కలెక్టరేట్ నుంచి ఆదేశాలు రావాల్సిందేనని దేవాలయ అధికారులు చేతులెత్తేసినట్టు తెలుస్తోంది. కనీసం వీరికి కూడా పాసులు ఇచ్చేందుకు తమ చేతుల్లో ఏమీ లేదని దేవాలయ అధికారులు పేర్కొంటున్నట్టు సమాచారం. కలెక్టరేట్‌కు వెళితే కనీసం ఎవరూ తమను పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఇన్‌చార్జిగా ఉన్న ఈవో మరో వారం, పది రోజుల్లో వెళ్లిపోయే భావనలో ఉండటంతో.. ఆయన్ని పూర్తిగా విస్మరించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా దేవాలయ అధికారులను, సిబ్బందిని నామమాత్రం చేసి అంతా కలెక్టరేట్ నుంచి, అధికార పార్టీ నేతల నుంచి వచ్చే ఆదేశాలే అమలవుతున్నాయనే విమర్శలు సింహాచలం కొండల చుట్టూ ప్రతిధ్వనిస్తుండటం గమనార్హం.



విద్యుత్ వెలుగుల్లో సింహగిరి

నిత్యచందన తేజోమూర్తి.. నిజరూప దర్శనానికి వేళాయె

- నేడు స్వామి వారి చందనోత్సవం
- ఉదయం 3.30 గంటల నుంచి సర్వ దర్శనాలు
- రాత్రి 7 గంటలకు క్యూలు మూసివేత





పుష్పాలంకరణలో ఆలయ పరిసరాలు, లోపలి భాగం



కలశాలు సిద్ధం చేస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వేళయింది. ఏడాది పొడవునా చందనం పూతతో దర్శనమిచ్చే స్వామిని, నిజరూపంలో దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. బుధవారం వేకువజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారిపై ఉన్న చందనాన్ని ఒలిచి, నిజరూప భరితుడిని చేస్తారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త కుటుంబ సభ్యులకు తొలిదర్శనం కల్పించి, వేకువజాము 3.30 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం కల్పించనున్నారు. రాత్రి 9 గంటల నుంచి స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తారు. విశేషపూజల అనంతరం స్వామికి తొలివిడతగా మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) చందనాన్ని సమర్పిస్తారు.

పటిష్ట ఏర్పాట్లు : చందనోత్సవానికి ఈ సారి రెండు లక్షల మంది భక్తులు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. సర్వదర్శనంతో పాటు రూ.300, రూ.1,000, రూ.1500ల దర్శనం టికెట్ల క్యూలు ఏర్పాటు చేశారు. వారికి కేటాయించిన స్లాట్ల ప్రకారం దర్శనాలకు అనుమతిస్తారు. రాత్రి 7 గంటలలోపు మాత్రమే సింహగిరిపై దర్శనాల క్యూల్లోకి భక్తులను అనుమతిస్తారు. అనంతరం క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి, అప్పటి వరకు క్యూల్లో ఉన్న భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6 గంటల వరకు సింహగిరిపైకి బస్సుల్లో భక్తులను అనుమతిస్తారు. చందనోత్సవం సందర్భంగా అన్ని శాఖల సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

చందనంలో సుగంధ ద్రవ్యాల మేళవింపు



చందనంలో సుగంధ ద్రవ్యాలు కలుపుతున్న అర్చకులు

చందనోత్సవం అనంతరం బుధవారం రాత్రి స్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనంలో దేవస్థానం అర్చకులు మంగళవారం పలురకాల సుగంధ ద్రవ్యాలను కలిపారు. సహస్ర ఘటాభిషేకానికి వెండి, మట్టి కలశాలను సిద్ధంచేశారు.



వైఎస్ జగన్‌ను కలిసిన కేకే రాజు



మాజీ ముఖ్యమంత్రిని కలిసిన వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్


సీతమ్మధార : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు కలిశారు. అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులతో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అధినేతను ప్రత్యేకంగా కలిసి పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఆయనతోపాటు పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ పరిశీలకుడిగా కదిరి బాబూరావు



ఏయూక్యాంపస్: వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలిగా మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, అరకు పార్లమెంట్ పరిశీలకుడిగా బొడ్డేడ ప్రసాద్ నియమితులయ్యారు. వీరు పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్లకు అనుసంధానంగా పనిచేస్తారు. అలాగే అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్తగా కరణం ధర్మశ్రీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు



తాటిచెట్లపాలెం: వేసవి వేళ ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనంగా జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తాత్కాలికంగా జతచేస్తున్నారు. విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం (58506/58505) పాసింజర్‌కు మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను, విశాఖపట్నం–భవానీపట్నం–విశాఖపట్నం (58504/58503) పాసింజర్‌కు మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ



పోలీసులకు సూచనలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో చర్చిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సింహాచలం: చందనోత్సవం ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్ పరిశీలించారు. డ్రై రన్ నిర్వహించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొండదిగువ కొత్త ఘాట్‌రోడ్డు, న్యూ గోశాల రోడ్డు, పాత గోశాల రోడ్డులో ఏర్పాట్లను పరిశీలించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కొండ దిగువ హోల్డింగ్ పాయింట్లలో వేచి ఉండేందుకు అనువుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి కొండెపైకి వెళ్లి క్యూలు, బారికేడ్లు, తాగునీరు, వైద్యశిబిరాలు, బయో మరుగుదొడ్ల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. సింహగిరి పైన, కొండదిగువన, తొలిపావంచా వద్ద, గోశాల జంక్షన్, అడవివరం జంక్షన్, ఇతర ప్రాంతాల వద్ద భద్రతా ఏర్పాట్లను సీపీ శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. పార్కింగ్ ప్రాంతాలు, సైన్ బోర్డులు, క్యూలు ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

భక్తుల సౌకర్యార్థం జీవీఎంసీ ఏర్పాట్లు



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్

దాబాగార్డెన్స్: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా జీవీఎంసీ విస్తృత ఏర్పాట్లు చేసింది. నగర మేయర్ పీలా శ్రీనివాస్ మంగళశారం అధికారులతో కలిసి కొండపై జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై ఆదేశాలు జారీ చేశారు. లక్షలాది మంది భక్తుల కోసం మంగళ, బుధ, గురువారాల్లో ఆరు షిఫ్టుల్లో 1,350 మంది పారిశుధ్య కార్మికులు సేవలు అందిస్తున్నట్లు మేయర్ తెలిపారు. దేవస్థానం పరిసర ప్రాంతాలన్నింటిలో పారిశుధ్య పనులు జరుగుతున్నాయని, శానిటరీ అధికారులు వీటిని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. భక్తుల తాగునీటి కోసం 193 పాయింట్లలో వాటర్ క్యాన్లు, వాటర్ బాటిల్స్ సిద్ధం చేశామన్నారు. ఎండల దృష్ట్యా అదనంగా ఆరు నీటి ట్యాంకర్లను సిద్ధంగా ఉంచామని, తాగునీటి సరఫరాను పర్యవేక్షించడానికి సిబ్బందిని నియమించామన్నారు. 21 ప్రాంతాల్లో 401 తాత్కాలిక మరుగుదొడ్లు, ఐదు మొబైల్ టాయిలెట్లు, చెత్త సేకరణకు డంపర్, కంపాక్టర్ బిన్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ శివప్రసాద్‌రాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చందనోత్సవానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

దాబాగార్డెన్స్: అప్పన్న చందనోత్సవానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. గోశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, పాతపోస్టాఫీస్, ఆర్కే బీచ్, కొత్తవలస, చోడవరానికి 60 బస్సులు, అడవివరం నుంచి హనుమంతువాక మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్కేబీచ్‌కు 20 బస్సులు, అడవివరం నుంచి విజయనగరానికి సుమారుగా 20 బస్సులు నడపనున్నట్లు చెప్పారు. అలాగే గోశాల నుంచి సింహాచలం కొండపైకి 35 బస్సులు, అడవివరం నుంచి సింహాచలం కొండపైకి 13 బస్సులు, అడవివరం నుంచి గోశాలకు 3 బస్సులు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు.

15 వైద్య శిబిరాల ఏర్పాటు

సీతంపేట : చందనోత్సవానికి వచ్చే భక్తుల కోసం కొండపైన 8, కొండ దిగువన 7 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వైద్య శిబిరాలకు అనుబంధంగా 16 ఏఎల్ఎస్ అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచినట్టు పేర్కొన్నారు. సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. మెడికవర్, అపోలో, విమ్స్, కేజీహెచ్ ఆసుపత్రులను రిఫరల్ కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కొండపైన పబ్లిక్ అమినిటీస్ సెంటర్‌లో 6 పడకలతో తాత్కాలిక వైద్య సదుపాయం కల్పించామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 99492 85370 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.



అపురూప సౌందర్యం.. అపార నిర్లక్ష్యం

కనుమరుగవుతున్న పర్యాటక వైభవం



సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

పర్యాటకులకు నిరాశ మిగుల్చుతున్న ఎర్రమట్టి దిబ్బలు



ఎర్రమట్టి దిబ్బల్లో ఖాళీ మద్యం సీసాలు

భీమునిపట్నం: విశాఖకు సమీపంలో.. భీమిలి బీచ్ రోడ్డులో ఉన్న ఎర్రమట్టి దిబ్బలు భారతదేశంలోనే ఓ విశిష్టమైన సహజ నిర్మాణం. ఇవి సుమారు 4 కిలోమీటర్ల పొడవు, 2 కిలోమీటర్ల వెడల్పుతో విస్తరించి ఉన్నాయి. ఈ అరుదైన భౌగోళిక ప్రదేశం పర్యాటకులను ఆకర్షిస్తున్నప్పటికీ.. పూర్తిస్థాయిలో వాటి అందాలను ఆస్వాదించే అవకాశం లేకపోవడం విచారకరం.

సముద్ర మట్టం అనేకసార్లు పెరిగి, తగ్గడం వల్ల తీరం ఇసుక, బంకమట్టితో కప్పబడింది. వాతావరణ మార్పుల ప్రభావంతో ఇసుక ఎండకు గట్టిపడి దిబ్బలుగా మారింది. ఆ తర్వాత గాలి, నీటి కోత వల్ల ప్రస్తుత రూపాన్ని సంతరించుకుందని చరిత్రకారులు చెబుతున్నారు. ఎర్రటి మట్టితో నిండి ఉండటం వల్ల వీటికి ఎర్రమట్టి దిబ్బలు అనే పేరు వచ్చింది. సుమారు 10 నుంచి 20 అడుగుల ఎత్తుతో.. దిబ్బల మధ్య నడవడానికి వీలుగా దారితో ఇవి విస్తరించి ఉన్నాయి. పాండిచ్చేరి, ముంబయి సమీపంలోని ఇలాంటి నిర్మాణాలు ఉన్నా.. అవి కేవలం ఐదు అడుగుల ఎత్తుకే పరిమితం. ఇంతటి ఎత్తైన, విస్తారమైన ఎర్రమట్టి దిబ్బలు దేశంలో ఇక్కడ మాత్రమే ఉండటం విశేషం. ఈ దిబ్బల ప్రత్యేకత కారణంగా రాష్ట్రంతో పాటు దేశంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడకు నిత్యం వస్తుంటారు. అంతేకాకుండా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలకు చెందిన ఎన్నో చిత్రాల షూటింగ్‌లు ఇక్కడ జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి.

పర్యాటకుల నిరాశ

ఎంతో ఆసక్తితో ఎర్రమట్టి దిబ్బలను చూడటానికి వచ్చే పర్యాటకులకు నిరాశే ఎదురవుతోంది. బీచ్‌రోడ్డును ఆనుకుని ఉన్న ఈ దిబ్బల అందాలను పూర్తిగా చూడాలంటే.. లోపలికి సుమారు రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. కానీ తీవ్రమైన ఎండ వేడి, కాలుతున్న ఇసుకలో అంత దూరం నడవడం కష్టతరంగా మారుతోంది. దీంతో చాలా మంది సందర్శకులు కొద్ది దూరం మాత్రమే వెళ్లి.. అలసిపోయి వెనుదిరుగుతున్నారు. పర్యాటకుల ఇబ్బందులను పరిష్కరించేందుకు గత ప్రభుత్వాలు కొన్ని ప్రకటనలు చేశాయి. సుమారు 15 ఏళ్ల కిందట నాటి పర్యాటక శాఖ 'డిజర్ట్ విలేజ్' పేరుతో ఒంటెల సఫారీ, రెస్టారెంట్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని ప్రకటించింది. గత ప్రభుత్వ హయాంలో శాండ్ స్కూటర్లు లేదా ఇతర వాహనాల ద్వారా సందర్శకులను లోపలికి తీసుకువెళ్లాలని భావించారు. కానీ ఈ ప్రణాళికలేవీ కార్యరూపం దాల్చలేదు.

శిథిలావస్థలో సౌకర్యాలు

గతంలో సందర్శకుల కోసం దిబ్బలకు వెళ్లే మార్గంలో కొన్ని వ్యూ పాయింట్లు, సేద తీరడానికి గుడిసెలు వంటివి ఏర్పాటు చేశారు. కనీసం వీటి వద్దనైనా పర్యాటకులు కాసేపు గడిపేవారు. అలాగే ఈ దిబ్బల ప్రాముఖ్యతను, చరిత్రను తెలిపే ఓ పెద్ద సమాచార బోర్డును కూడా ఏర్పాటు చేశారు. అయితే కాలక్రమేణా ఈ వ్యూ పాయింట్లు, గుడిసెలు పూర్తిగా పాడైపోయి నిరుపయోగంగా మారాయి. సమాచార బోర్డు కూడా కనుమరుగైపోయింది. ఒకప్పుడు దిబ్బలలోకి వెళ్లే ముందు భాగం విశాలంగా ఉండటంతో పర్యాటకులు అక్కడే ఫొటోలు, వీడియోలు తీసుకుని ఆనందించేవారు. కానీ ఇప్పుడు ఆ ప్రదేశమంతా తుప్పలు, పిచ్చి మొక్కలతో నిండిపోయి.. కేవలం ఇరుకైన కాలిబాట మాత్రమే మిగిలింది. దీనికి తోడు పరిసర ప్రాంతాల్లో మద్యం సేవించే వారి వల్ల పగిలిన సీసాలు, ఇతర చెత్త పేరుకుపోయి పర్యావరణం దెబ్బతింటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి.. ఎర్రమట్టి దిబ్బల పూర్తి అందాలను ఆస్వాదించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.



ఇప్పుడు పూర్తిగా పాడైపోయిన వ్యూపాయింట్

నిరాశతో వెనక్కి వచ్చేశాం



పలు సినిమాల్లో ఎర్రమట్టి దిబ్బలను చూశాను. ఎంతో అద్భుతంగా కనిపించాయి. వాటిని నేరుగా చూడాలన్న ఆశతో కుటుంబం సహా ఇక్కడకు వచ్చాను. కానీ లోపల వరకు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంది. కొద్ది దూరం వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చేశాం. ఎర్రమట్టి దిబ్బల పర్యటన నిరాశ కలిగించింది. -బి.వేణుగోపాల్, బెంగళూరు

నిర్లక్ష్యం చేయవద్దు



ఎర్రమట్టి దిబ్బల ప్రాంతాన్ని సందర్శించడంలో పర్యాటకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. ఇంతటి సహజ సంపదను, పర్యాటక ఆకర్షణను అభివృద్ధి చేసే అవకాశాన్ని వదులుకోవద్దు.
-కె.చంద్రశేఖర్, హైదరాబాద్

సౌకర్యాలు కల్పించాలి



సందర్శకులు లోపలకు వెళ్లి రావడానికి వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు, రెస్టారెంట్లు తదితర సౌకర్యాలు కల్పించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఆ మేరకు ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాలి.
- వేదుల సాయిరాం, చిత్తూరు

నేడు పాలిసెట్

- 33 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో హాజరుకానున్న 13,157 మంది విద్యార్థులు



పాలిసెట్ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకుడు విజయభాస్కర్

మురళీనగర్: జిల్లాలో బుధవారం జరిగే పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 33 కేంద్రాల్లో 13,157 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్, భీమిలి మహిళా పాలిటెక్నిక్ కాలేజీలను కో–ఆర్డినేటింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. విశాఖ కేంద్రం పరిధిలో 22, పెందుర్తి పరిధిలో 5, భీమిలి పరిధిలో 6 కేంద్రాలు ఉన్నాయి. విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ కో–ఆర్డినేటింగ్ ఆఫీసరుగా కె.నారాయణరావు, పెందుర్తి కోఆర్డినేటర్‌గా ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్, భీమిలి కోఆర్డినేటర్‌గా ప్రిన్సిపాల్ జి.మురళీకృష్ణ వ్యవహరిస్తారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల కోసం తాగునీరు, వైద్య సౌకర్యాలు, ఫ్యాన్లు వంటి కనీస ఏర్పాట్లు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా, అవసరమైతే బస్సు సౌకర్యం కోసం సంబంధిత శాఖలకు సమాచారం అందించారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 11 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించమని అధికారులు స్పష్టం చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు బ్లూ/బ్లాక్ బాల్‌పాయింట్ పెన్, రబ్బరు, పెన్సిల్, షార్ప్‌నర్ మాత్రమే తీసుకురావాలి. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, కాలిక్యులేటర్లు వంటివి పూర్తిగా నిషేధం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్ రాని వారు సంబంధిత కో–ఆర్డినేటింగ్ కేంద్రాన్ని సంప్రదించాలని డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. జిల్లా పరిశీలకుడు, టెక్నికల ఎడ్యుకేషన్ అకడమిక్ డిప్యూటీ డైరెక్టర్ కె.విజయభాస్కర్, విశాఖ కోఆర్డినేటింగ్ సెంటర్ పరిశీలకుడు జి.దామోదరరావు మంగళవారం ఎస్ఏడీ భాష్యం, ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మహిళా డిగ్రీ కాలేజీ, వీఎంఆర్డీఏ పార్కు గాయత్రి విద్యాపరిషత్–ఎంఎల్‌బీటీ పాఠశాల తదితర కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల ఇన్విజిలేటర్లకు పలు సూచనలిచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం ఉన్నందున దూర ప్రాంతాల విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

ఉర్సా కంపెనీకి భూ కేటాయింపు రద్దు చేయాలి



విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: ఉర్సా కంపెనీకి కూటమి ప్రభుత్వం చేసిన భూ కేటాయింపుల్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. ఉర్సా కంపెనీకి కూటమి ప్రభుత్వం ఎకరా 99 పైసలు చొప్పున 59.6 ఎకరాలు భూమిని కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం మద్దిలపాలెం జోన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఆ భూ కేటాయింపు రద్దు చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం కుమార్ మీడియాతో మాట్లాడుతూ..ఉర్సా అనేది కూటమి నాయకులకు బినామీ కంపెనీ అని తెలిపారు. విశాఖలో ఉన్న నిరు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి భూములు లేవని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఇలాంటి బోగస్ కంపెనీకి కాపులుప్పాడ ప్రాంతంలో రూ.వేల కోట్లు విలువచేసే 59.6 ఎకరాల భూమి కేటాయించడం ఆక్షేపణీయమన్నారు. ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు డి.అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, పి.శంకరరావు, కె.కుమారి, నాయుడు, రాజ్‌కుమార్, లక్ష్మి, రమణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు శ్రీనివాసరావు ఫైల్

సబ్బవరం: మండలంలోని గొర్లివానిపాలెం జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు సత్యవరపు శ్రీనివాసరావు(53) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. శ్రీనివాసరావు సబ్బవరం హైస్కూల్ సమీపంలో జనరల్ స్టోర్ నడుపుతున్నాడు. మంగళవారం ఉదయం తన స్కూటీపై గోడివాడ వెళ్తుండగా, గొర్లివానిపాలెం సమీపంలో సబ్బవరం నుంచి చోడవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. బస్ టైర్ కింద ఇరుక్కుపోయి, సంఘటనా స్థలిలోనే మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దివ్య తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్‌ను సీజ్ చేసి, మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.

రూ.1.74 కోట్ల ఆస్తి పన్ను వసూలు



రెవెన్యూ అధికారులకు చెక్కు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు (పాత వార్డు) పరిధి కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ నుంచి రూ.1.74 కోట్ల ఆస్తి పన్నును రెవెన్యూ అధికారులు వసూలు చేశారు. సంస్థ ప్రతినిధులు జారీ చేసిన డీడీని మంగళవారం జోన్–5 రెవెన్యూ అధికారులు (ఆర్వోలు) బాబూరావు, రాజ్యలక్ష్మి కలిసి జ్ఞానాపురం జోన్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐలు, ఇతర సిబ్బంది, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి



తాతారావు(ఫైల్)

తగరపువలస: భీమిలి పట్టణ నదీ సాగర సంగమ తీరంలో చేపల వేటకు వెళ్లిన బోయవీధికి చెందిన మత్స్యకారుడు చింతపల్లి తాతారావు(65) ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందాడు. ప్రతిరోజూ భీమిలి జోనల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో వేటకు వెళ్లడం అతనికి అలవాటు. అందులో భాగంగానే సోమవారం సాయంత్రం 4.30 సమయంలో వేటకు వెళ్లాడు. అయితే అలల తాకిడికి అతను మునిగి చనిపోయినట్లు భావిస్తున్నారు. అతని మృతదేహం మంగళవారం ఉదయం భీమిలి మండలం అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం తీరానికి చేరింది. తాతారావుకు భార్య పైడమ్మ, కుమారులు పోలిరాజు, అప్పన్న, నూకరాజు, కుమార్తె నందిని ఉన్నారు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. తాతారావు మృతితో బోయవీధిలో విషాదచాయలు అలముకున్నాయి.

తల్లికి బాలిక అప్పగింత

తుని: ఇంటి నుంచి బయటకు వచ్చి తుని రైల్వే స్టేషన్‌కు వచ్చిన బాలికను తల్లికి అప్పగించామని జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు డీఎస్పీ జయరాం పర్యవేక్షణలో మంగళవారం తుని రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీలు నిర్వహించామన్నారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై బాలిక కనిపించింది. వాకబు చేయగా విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన బాలిక రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చినట్టు చెప్పిందన్నారు. దీంతో కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి ఆమె తల్లికి అప్పగించామని తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్‌కి యువకుడి బలి



పవన్ మృతదేహం

సీతమ్మధార: క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్న ఓ యువకుడు తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌కు చెందిన చెక్కల పవన్ (25) ఎంవీపీ కాలనీలోని ఓ లాడ్జిలో పనిచేస్తున్నాడు. అతనికి క్రికెట్ బెట్టింగ్ అలవాటు ఉంది. ఐపీఎల్‌లో బెట్టింగ్ ఆడేందుకు గతంలో లాడ్జి యజమాని వద్ద రూ.30 వేలు తీసుకుని పోగొట్టుకున్నాడు. ఇటీవల అతని వద్ద మళ్లీ రూ.20 వేలు తీసుకున్నాడు. ఈ మొత్తాన్ని కూడా కోల్పోయాడు. ఈ కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. మంగళవారం సాయంత్రం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే పవన్ ఓ యువతితో ప్రేమ విఫలమైనట్లు కూడా తెలుస్తోంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.110
బ్రాయిలర్ (లైవ్)	: రూ.130
స్కిన్	: రూ.230
స్కిన్‌లెస్	: రూ.240

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	435.00
విజయనగరం	439.00
శ్రీకాకుళం	439.00

'ఓమ్ని'లో పిల్లల క్యాన్సర్ విభాగం ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న వైద్యుల బృందం

బీచ్‌రోడ్డు: ఇటీవల కాలంలో పిల్లల్లో క్యాన్సర్ పెరుగుతోందని ప్రముఖ పీడియాట్రిక్ వైద్యుడు రాధాకృష్ణ తెలిపారు. ప్రముఖ క్యాన్సర్ కేర్ నెట్‌వర్క్ సయాన్ క్యాన్సర్ క్లినిక్స్, ఓమ్ని హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆస్పత్రిలో అత్యాధునిక పిల్లల క్యాన్సర్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ బారిన పడుతున్న పిల్లల సంఖ్య పెరుగుతోందని, మనదేశంలో కూడా ఈ సంఖ్య ఆందోళనకర రీతిలో ఉందన్నారు. సరైన సమయంలో వ్యాధి నిర్ధారణ, త్వరగా చికిత్స తీసుకోవడం ద్వారానే క్యాన్సర్ నుంచి వారిని కాపాడుకోగలమన్నారు. సయాన్ క్యాన్సర్ క్లినిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ శశి సుంకర్ మాట్లాడుతూ క్రిటికల్ కేర్ నుంచి క్యాన్సర్ చికిత్స వరకు పిల్లల కోసం అవసరమైన అన్ని సేవలు ఇప్పుడు ఓమ్నిలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ప్రత్యేకించి పిల్లల కోసం రూపొందించిన మల్టీ–డిసిప్లినరీ క్యాన్సర్ చికిత్స కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. క్యాన్సర్ చికిత్సతో పాటు మానసిక ఆరోగ్యం, పోషకాహారం, జన్యు సలహా తదితర సమగ్ర సేవలు అందిస్తామన్నారు. సయాన్ క్యాన్సర్ క్లినిక్స్ ప్రతినిధులు డాక్టర్ భారతీదేవి, డాక్టర్ రాఘవేంద్ర నాయక్, డాక్టర్ వెంకట సుష్మ, డాక్టర్ గౌరి నాయుడు, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, సుభాష్, ఓమ్ని ఆర్కే వైద్య నిపుణుడు డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూలో వన్యప్రాణుల ఆరోగ్యంపై దృష్టి



జూలో వన్యప్రాణులు, ఎన్‌క్లోజర్లు పరిశీలిస్తున్న జూ ఆరోగ్య కమిటీ సభ్యులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కును మంగళవారం జూ ఆరోగ్య కమిటీ సందర్శించింది. జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లతో కలిసి కమిటీ సభ్యులు హైదరాబాద్‌లో నెహ్రూ జూ పార్కు విశ్రాంతి వైద్యుడు ఎం.నవీన్ కుమార్, ఆర్ఏడీడీఎల్(పశు సంవర్థక శాఖ) డీడీ డాక్టర్ పి.మోహిని కుమారి, వీపీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మహేష్ తదితరులు జూలో వన్యప్రాణులు, వాటి ఎన్‌క్లోజర్లను పరిశీలించారు. ఇక్కడ జంతువులు ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. అనంతరం జూ క్యూరేటర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. జంతువుల సంరక్షణ, వాటి సంక్షేమం, వాటికి అందించాల్సిన పోషక విలువలతో కూడిన ఆహారం గురించి చర్చించారు. ప్రస్తుతం వేసవి ఎండలు తీవ్రతను బట్టి చేపట్టదలచిన నిర్వహణ చర్యలు, వాటికి అందించాల్సిన వైద్య సేవల గురించి చర్చించారు. మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్న 19 ఏళ్ల చిరుత(హర్ష)కు అందించాల్సిన వైద్యం గురించి ప్రత్యేక దృష్టిపెట్టాలని జూ వైద్య సిబ్బందికి సూచించారు. జూలో మార్మోసెట్ కోతులు, స్క్విరెల్ కోతులు, మీర్కాట్, జిరాఫీ, రాయల్ బెంగాల్ టైగర్స్, తెల్ల పులులు, సింహాలు, హైనాలు, స్లాత్ బేర్, వాటర్ మానిటర్ బల్లులు, ఆఫ్రికన్ చిలుకలు సంతానోత్పత్తికి సంబంధించిన పలు సూచనలు, సలహాలు చేశారు.

ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల జోనల్ కమిటీ ఎన్నిక



కొత్తగా ఎన్నికైన సంఘం కార్యవర్గ సభ్యులు తదితరులు

ఎంవీపీకాలనీ: ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల జోనల్ కమిటీ ఎన్నిక ఎంవీపీ కాలనీ మెడికవర్ హాస్పటల్‌లోగా జరిగింది. మంగళవారం జరిగిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు అనంతరం సభ్యులు ఈ కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా జోనల్ కమిటీ అధ్యక్షుడిగా జంగం జోషి, ప్రధాన కార్యదర్శిగా గెద్ద చిరంజీవి, ఉపాధ్యక్షులుగా అల్లాడ త్రినాథరావు, ఏలేటి రోజా, ఎస్.శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాసరావు, సూర్యకళ, నారాయణరావు, కోశాధికారిగా పి.కనకారావు ఎన్నికయ్యారు. దీంతోపాటు ఈసీ సభ్యులను కూడా ఎన్నుకున్నారు ఉత్తరాంధ్ర నుంచి సుమారు 150 మంది గ్రామీణ వైద్యులు పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు, సీనియర్, విశ్రాంత వైద్యులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న మేఘాలు

నగరంలో మూడు రోజులుగా వాతావరణం మేఘావృతమై ఆశలు రేకెత్తిస్తోంది. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఎండ, అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో నగరవాసులు అల్లాడిపోతున్నారు. సాయంత్రం సమయానికి ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడం కాస్త ఉపశమనాన్నిస్తోంది. అయితే వర్షం మాత్రం కురవకుండా ఉసూరుమనిపిస్తుంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



సాక్షి Smart Economic Display



సాక్షి క్లాసిఫైడ్స్

Education

SPOKEN ENGLISH
■ Spoken English Batches Commence for Children / Adults on 1st May 2025 Morning Batch. Contact : Sheila Jackson - 98484 98510. Olivet English Institute, Vizag. [V- SCA25003075]

CHANGE OF NAME
I, JOLEKHA BIBI, W/o Mazid Khan, Residing at D.No.26-35-6/1, Chaitanya Nagar, Suryathej School, Old Gajuwaka, Visakhapatnam, Andhra Pradesh-530026. Now changed my name from JULEKHA BIBI (Old Name) to JOLEKHA BIBI (New Name). Henceforth I will be called as JOLEKHA BIBI for all purpose.

Real Estate

PLOT FOR SALE
■ అతి తక్కువ ధరకే ఇంటి స్థలం. గాజువాక దగ్గరలో, GVMC పరిధిలో 90, 100, 150 గజాలు ప్లాట్లు కలవు గజం ధర : 5,999/-, రిజిస్ట్రేషన్ ఫ్రీ. ఫోన్ : 91601 91101 [SCA25003051]

Wanted

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25–30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA25003056]

■ Wanted Sales Persons (Male or Female) to reputed furniture Showroom at Dwarakanagar Main Road. Ph : 77299 49079 [V- 13723]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ — లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం